క్లుప్తంగా

పరామర్శ



గజవర్ధననాయుడును పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త టంకాల గజవర్ధననాయుడును పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పరామర్శించారు. గుండె సంబంధిత శస్త్రచికిత్స చేసుకుని ఇంటి వద్దనే కోలుకుంటున్న విషయం తెలుసుకుని, ఆయన వద్దకు సోమవారం వెళ్లి, ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, సర్పంచ్ టంకాల ఉమాపాపినాయుడు, టంకాల బుచ్చినాయుడు తదితరులు ఉన్నారు.

ప్రతిభా పరీక్షకు విశేష స్పందన



నగదు బహుమతులు పొందిన విద్యార్థులతో సిబ్బంది

వంగర: స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన ప్రతిభా పరీక్షకు విశేష స్పందన లభించింది. విజయనగరానికి చెందిన ఏపీ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షకు నాలుగో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు మొత్తం 150 మంది హాజరై, విశేష ప్రతిభ కనబరిచారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు, కె.రమేష్, తిరుపతి, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



అధికారులకు సూచనలిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పలువురు అధికారులతో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు సోమవారం సమావేశమై, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా అందరూ సమన్వయంతో మండల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని జెడ్పీ వైస్ చైర్మన్ సూచించారు. సమావేశంలో ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, ఏపీవో ఆర్.హరనాథరావు, కాకరాపల్లి సర్పంచ్ వి.రమణారావు, గోళ్లవలస సర్పంచ్ డి.దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీలో గ్రామస్తులు

బొబ్బిలిరూరల్: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ మండలంలోని రాచ్చేరువలస గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఉగ్రవాదులు సృష్టించిన మారణకాండను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని కోరారు. అనంతరం మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో ధూపం వాసు, కృష్ణదాసు తదితరులు పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఈఈ సురేష్‌బాబు

రాజాం సిటీ: పీఎం సూర్యఘర్ పథకంతో ఎంతో ప్రయోజనం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు అన్నారు. స్థానిక పట్టణంలోని వస్త్రపురి కాలనీలోని ప్రజలకు పీఎం సూర్యఘర్ పథకంపై సోమవారం అవగాహన కల్పించారు. సబ్సిడీ ద్వారా లభించే ఈ పథకానికి బ్యాంకులే రుణ సదుపాయం కల్పిస్తాయన్నారు. విద్యుత్ సోలార్ ప్యానెల్ వినియోగం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ ఫణీంద్రకుమార్, ఏఈ ఓజీసీపీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రేగిడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ ఈశ్వరరావు



రామభద్రపురం లైబ్రరీలో విద్యార్థులతో కథల పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ సత్యవాణి

వేసవి వినోదం..విజ్ఞానం

వేసవి విజ్ఞాన శిబిరాలు గ్రంథాలయాల్లో సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సెలవుల్లో స్నేహితులతో చక్కర్లు కొట్టడం, ఊర్లు తిరుగుతూ సరదాగా గడపడం వంటివి విద్యార్థులు చేస్తుంటారు. దీంతో పాఠశాలల పునఃప్రారంభం నాటికి చదువుపై అశ్రద్ధ, నిర్లక్ష్యం పెరుగుతాయి. వీటిని అధిగమించేందుకు ఏటా లైబ్రరీల్లో పిల్లలకు వినోదం, విజ్ఞానం పంచేలా ఈ శిబిరాలు నిర్వహిస్తుంటారు. జూన్ 6వ తేదీ వరకు కొనసాగే ఈ శిబిరాల్లో విజ్ఞానం పెంపొందిస్తూనే వినోదం పంచే కార్యక్రమాలుంటాయని, సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్‌లు కోరారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



సంతకవిటి లైబ్రరీలో కథలు చదివి అర్థం చేసుకోవడాన్ని వివరిస్తున్న లైబ్రేరియన్ శ్రీదేవి



తెర్లాం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో పాపారావు, లైబ్రేరియన్ కృష్ణమూర్తి



బాడంగి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ శ్రీను

నిస్సిగ్గుగా నీతిమాలిన రాజకీయాలు

- కూటమి సర్కారుపై మాజీ ఎమ్మెల్యే శంబంగి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిస్సిగ్గుగా నీతిమాలిన రాజకీయాలు చేస్తోందని వైఎస్సార్ సీపీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు విమర్శించారు. ఇదే విషయమై ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతానికి పైగా స్థానాలు వైఎస్సార్ సీపీ హుందాతనమైన రాజకీయంతో చేజిక్కించుకుంటే వాటిని ఎలాగైనా తిరిగి లాక్కుని అందలమెక్కాలనే కుటిల బుద్ధితో టీడీపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఆ పార్టీ అధికారం ఎక్కిన నాటి నుంచి చేస్తున్న కుట్రపూరిత, మోసపూరిత రాజకీయాలను ప్రజలంతా చూసి సిగ్గుపడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఫిరాయింపుల కోసం లాలూచీలు, బేరసారాలకు దిగడం మరింత ఎక్కువయ్యాయన్నారు. ప్రలోభాల ఎరతో అవతలి పార్టీలో కొంతమందిని లాక్కుని, చైర్మన్ కుర్చీ ఎక్కించేందుకు ప్రాధాన్యమిస్తున్నారన్నారు తప్ప ప్రజాసంక్షేమానికి కాదన్నారు. పాలకొండ, తుని, కుప్పం, విశాఖపట్నం, గుంటూరు ప్రాంతాల్లో ఇదే పరిస్థితిలో కుటిల రాజకీయాలు చేశారని ధ్వజమెత్తారు. బొబ్బిలి రాజులు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాతే ఇటువంటి పరిస్థితులు బొబ్బిలిలో కూడా వచ్చాయన్నారు. వారు ప్రజాప్రతినిధులకు అరచేతిలో వైకుంఠం చూపించి మోసం చేస్తున్నారని విమర్శించారు. గతంలో జరిగిన రాజకీయ సంఘటనలే దీనికి నిదర్శనమన్నారు. నిఖార్సయిన రాజకీయాలు వారి కారణంగా భ్రష్టు పట్టాయని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదన్నారు. బొబ్బిలిలో రాజకీయాలు కలుషితమయ్యాయన్నారు. గతంలో ఇటువంటి రాజకీయాలతోనే వారిని ప్రజలు తిరస్కరించినా ఇంకా ఆ బుద్ధులు మానలేదన్నారు. మళ్లీ తెరమరుగు కాక తప్పదని జోష్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, తెర్లాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు బలనిరూపణ..

బొబ్బిలి: బొబ్బిలి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అవిశ్వాస రాజకీయాలు నడుస్తున్నాయి. రాజుల హయాంలో ఎంపీపీలపై రెండు సార్లు అవిశ్వాస తీర్మానాలు పెట్టారు. ఇప్పుడు మరోసారి ఏకంగా మున్సిపల్ పీఠంపై కన్నేశారు. కనీసం ఆరు మాసాలు కూడా లేని మున్సిపల్ చైర్మన్ పదవిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు కౌన్సిలర్లకు ఎర చూపి వారితో శిబిరాలు నడిపిస్తున్నారు. దీనికి సంబంధించి, బల నిరూపణ సమావేశాన్ని ఆర్డీవో జేవీవీఎస్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో బొబ్బిలి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. మున్సిపాలిటీలో 31 వార్డు కౌన్సిలర్లకు వైఎస్సార్ సీపీకి 21,(ఇద్దరు పార్టీలో చేరిన వారితో కలిపి) టీడీపీకి 10 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వైఎస్సార్ సీపీకి ఇంత బలమున్నా టీడీపీకి చెందిన నాయకులు బొబ్బిలి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు.

విప్ జారీ..

వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లు దాదాపు 10 మంది.. టీడీపీ ప్రలోభాలకు తలొగ్గడంతో వారికి పలుమార్లు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు వారి మాయలో పడకండని చెప్పారు. మనమంతా ఒకటే రండి అని, ఏ పార్టీ గుర్తుపై గెలిస్తే ఆ పార్టీలోనే ఉండాలని, కలిసి మంచి రాజకీయాలు చేద్దామని పిలిచారు. కానీ వారి నుంచి ఏ సమాధానం రాలేదు. దీంతో వారికి విప్ జారీ చేశారు. దీంతో వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచిన కౌన్సిలర్లు టీడీపీ సూచించిన అభ్యర్థి వైపు ఓటేస్తే వారి అభ్యర్థిత్వం రద్దవుతుందని రాజకీయ పండితులు చెబుతున్నారు. దీనికి సంబంధించిన నోటీసులు ఇప్పటికే ఆయా కౌన్సిలర్ల ఇళ్లకు, రిజిస్టర్ పోస్టు, వాట్సాప్, కొరియర్‌ల ద్వారా పంపించారు.

ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలి

తెర్లాం: మండలంలోని నందిగాం గ్రామంలో సోమవారం నుంచి జరుగుతున్న గ్రామదేవత పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు కోరారు. తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబుతో కలిసి ఆయన ఆదివారం రాత్రి నందిగాం గ్రామాన్ని సందర్శించి, గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగే పండగలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. మద్యం బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మంగళవారం జరిగే సిరిమానోత్సవంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నడవలేకపోతున్నా.. ట్రై సైకిల్ ఇప్పించండయ్యా..

ఈ చిత్రంలో కనిపిస్తోంది.. బొబ్బిలి మండలం, చింతాడ గ్రామానికి చెందిన దివ్యాంగుడు తోట ప్రసాద్. ఇతడి రెండు కాళ్లు చచ్చుబడిపోయి నడవలేని స్థితిలో ఉన్నాడు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన గ్రీవెన్స్‌కు ఇలా పాకుతూ హాజరై.. నడవలేకపోతున్నా.. ట్రైసైకిల్ ఇప్పించండి అయ్యా అని అధికారులను మొరపెట్టుకున్నాడు. గతంలో చాలాసార్లు ఇలానే ఆదుకోవాలని వినతిపత్రాలు ఇచ్చానని, ఎవరూ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని తనకు ట్రైసైకిల్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

– బొబ్బిలి రూరల్



చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన వృద్ధుడు బట్న బోడేస్(60) చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు సోమవారం తెలిపారు. హెచ్‌సీ రాజశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బోడేస్ ఈ నెల 26వ తేదీ రాత్రి భోజనం చేసి కళ్లం వద్ద నిద్రించేందుకు వెళ్లాడు. అదే రోజు రాత్రి 10 గంటలకు అతడి కొడుకు ఆదినారాయణ కళ్లం వద్దకు వెళ్లి చూడగా, తండ్రి అపస్మారకస్థితిలో ఉండడాన్ని గమనించాడు. పక్కనే చీమలమందు ఉండడాన్ని చూసిన అతడు వెంటనే రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి బోడేస్‌ను తరలించారు. అతడి పరిస్థితి విషమించడంతో వైద్యులు శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు హెచ్‌సీ పేర్కొన్నారు. కడుపునొప్పి తాళలేక చీమలమందు సేవించినట్లు అతడి కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎండీయూ నిధుల దుర్వినియోగంపై విచారణ



విచారణ చేస్తున్న సీఎస్‌డీటీలు

బాడంగి: మండలంలోని పింద్రంగివలస గ్రామ రేషన్ పంపిణీకి సంబంధించి, ఎండీయూ(మల్టీ పుల్ డీజిల్ యూనిట్)వాహనాల నిధుల దుర్వినియోగంపై ముగ్గురు సీఎస్‌డీటీల బృందం సోమవారం విచారణ చేపట్టింది. వాహనం తిరగకుండానే 8 నెలల పాటు నెలకు రూ.18 వేలు చొప్పున వేతనాలు విత్‌డ్రా చేశారన్న ఆరోపణలపై ఆ గ్రామ సామాజిక కార్యకర్త రౌతు సురేష్ కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఎస్‌వో.. విచారణకు కమిటీని ఆదేశించారు. ఈ మేరకు సీఎస్‌డీటీలు గ్రామానికి వెళ్లి, వాహన యజమాని కొత్తల సత్యనారాయణను విచారించారు. 2024 మే నెలలో బాధ్యతలు చేపట్టి, ఆగస్టులో మానివేసినప్పటికీ 8 నెలల పాటు నెలకు రూ.18 వేలు చొప్పున మొత్తం రూ.1.44 లక్షలు తన ఖాతాలో జమ అయ్యాయని తన సొంతానికి వాడుకున్నానని అంగీకరించాడు. అవకాశమిస్తే ఆ సొమ్మును తిరిగి చెల్లించేస్తానని రాతపూర్వకంగా తెలిపాడు. విచారణకు వెళ్లిన వారిలో బొబ్బిలి, గజపతినగరం, దత్తిరాజేరు మండల సీఎస్‌డీటీలు సాయికృష్ణ, సత్యనారాయణ, తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు





విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

బొబ్బిలిరూరల్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అభినందించారు. మండలంలోని పక్కి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత విద్యార్థిని ఎస్.కె.లావణ్య(592), కోమటిపల్లి జ్యోతిరావు పూలే పాఠశాల విద్యార్థి కె.శివ (592)లను జిల్లా కేంద్రానికి సోమవారం పిలిపించుకుని మరీ కలెక్టర్ తన కార్యాలయంలో వారిని సన్మానించారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందిస్తూ ప్రశంసాపత్రాలు అందజేశారు. భవిష్యత్‌లో కూడా బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఈవో మాణిక్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా....

రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు

బొబ్బిలి: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ప్రకటించిన హై అలర్ట్ నేపథ్యంలో ఈ తనిఖీలు చేసినట్లు తెలుస్తోంది.

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలి

బాడంగి: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో రామభద్రపురం, బాడంగి, రేజేరు సెక్టార్‌ల అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులతో ఐసీడీఎస్ పీవో కె.రాజ్యలక్ష్మి సోమవారం సమావేశమయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలని, కిశోరి బాలికల వికాసం, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. క్రమం తప్పకుండా వారికి అందివ్వాల్సిన పౌష్టికాహారం అందివ్వాలని తెలిపారు. వేసవి సెలవుల్లో నెల రోజుల్లో 15 రోజులు కార్యకర్తలు.. మరో 15 రోజులు ఆయాలు ఉండి కేంద్రాలు నిర్వహించాలన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో మాతా శిశు సంరక్షణ, పోషణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అవగాహన కార్యక్రమం అనంతరం బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రోహిత్‌కుమార్, అగస్టీన్, సాయికుమార్, సూపర్‌వైజర్లు అరుణ, నిర్మల, రోటరీ క్లబ్ ప్రతినిధులు శివకాంత్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

వంగర: మండలంలోని కొండచాకరాపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో మర్రాపు సత్యవతి సోమవారం పరిశీలించారు. వేసవి ఎండల దృష్ట్యా రోజుకు రెండు పూటలా చల్లగా ఉన్న సమయాల్లో పనులు చేయాలని, తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

వంగర: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. గంట కాలం పాటు కురిసిన ఎడతెరిపిలేని వర్షానికి వాతావరణం చల్లగా మారింది. దీంతో ఇన్నాళ్లు ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు వర్షం రాకతో ఉపశమనం పొందారు.

విప్ ప్రొసీడింగ్స్ అందజేత

బొబ్బిలి: మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానికి పట్టుబడుతున్న కూటమి నాయకులకు మద్దతుగా నిలుస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లకు పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు సోమవారం విప్ జారీ చేశారు. ఈ మేరకు ఆ విప్ ప్రొసీడింగ్స్‌ను పార్టీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు తదితరులు కలిసి ఆర్డీవో జేవీవీఎస్ రామ్మోహనరావుకు సాయంత్రం బొబ్బిలిలోని ఆర్డీవో కార్యాలయంలో అందజేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని కలాసీ సంఘ కార్యాలయంలో మే 1వ తేదీన జరిగే 'మే' డేకు సంబంధించి, వాల్‌పోస్టర్‌ను ఆ సంఘ కార్యదర్శి దంతులూరి వర్మ సోమవారం ఆవిష్కరించారు. మేడే రోజున పట్టణంలో ర్యాలీ, అదేరోజు సాయంత్రం 5 గంటలకు తాండ్రపాపారాయ జంక్షన్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బి.అప్పలస్వామి, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు

నేడు చెరకు రైతుల సమావేశం

రేగిడి: మండంలోని ఉంగరాడమెట్ట వద్ద చెరకు రైతుల సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఖండ్యాం ఎంపీటీసీ కింజరాపు సురేష్ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశానికి చెరకు పండించే రైతులంతా హాజరై, తమ సమస్యలు చెప్పుకోవాలని, అనంతరం సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. ఇదే సమావేశానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ హాజరుకానున్నారన్నారు.

కలెక్టరేట్‌కు వెళ్లొద్దు.. తహసీల్దారు కార్యాలయానికి రండి..



ఆర్డీవోకు విప్ ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తెర్లాం: ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్, ఎంపీడీవో రేగి.రాంబాబు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించి, పలువురు సమర్పించిన వినతిపత్రాలను సదరు అధికారులు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు గానీ ఇతర ప్రజలు గానీ ఏ సమస్య పరిష్కారం కోసమైనా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు వెళ్లొద్దని, ఏ సమస్య ఉన్నా తహసీల్దారు కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుడు ఇచ్చిన ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నీలిమ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు

రాజాం సిటీ: మండలంలోని పొనుగుటివలస గ్రామంలో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో తొలిరోజు దేవతామూర్తుల విగ్రహాల తిరువీధి చేపట్టారు. అలాగే మహిళలంతా కలశాలలతో ఊరేగారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

భానుడి ప్రతాపం.. రోడ్లు నిర్మానుష్యం!



భానుడు(సూర్యుడు) తన ప్రతాపం చూపిస్తున్నాడు. రోజురోజుకూ మండే ఎండల తీవ్రత అధికమవుతుండడంతో రోడ్లపై తిరుగాడేందుకు ఏ ఒక్కరూ ఇష్టపడడం లేదు. ఎండ తగ్గితే బయటకు వెళదామని అందరూ ఇంట్లోనే ఉంటున్నారు. దీంతో వీధులు, రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఈ చిత్రంలో కనిపిస్తోంది.. రాజాం జీఎంఆర్ఐటీ ప్రధాన రోడ్డు. సోమవారం ఎండ తీవ్రతకు భయపడి ఎవరూ రాకపోవడంతో ఇలా ఖాళీగా ఉంది. ఇంకెన్నాళ్లు భరించాలో ఈ ఎండలు అని జనం అనుకుంటున్నారు.

– రాజాం

లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మె

కేంద్రం తీసుకువస్తున్న లేబర్ కోడ్‌లు వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు తెలిపారు. తెర్లాం మండలం, కొర్లాం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సోమవారం సమావేశమైన ఆయన.. బ్రిటిష్ కాలం నాటి కార్మిక చట్టాలు తీసివేస్తూ కార్మికుల హక్కులు హరించేలా లేబర్ కోడ్‌లు అమలు చేయాలని చూస్తుండడం అన్యాయమన్నారు. దీనికి నిరసనగా అన్ని ట్రేడ్ యూనియన్లతో కలిసి మే 20వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మె చేస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరారు. అనంతరం సమ్మె కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

– తెర్లాం



తక్షణమే పే స్కేల్ అమలుచేయాలి



వీఆర్ఏల వేతనాలకు సంబంధించి, తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని సంతకవిటి మండల వీఆర్ఏల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో తహసీల్దారు బి.సత్యం, డీటీ రంజిత్‌లను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని, నామినీలుగా ఉన్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని, అటెండర్, నైట్ వాచ్‌మన్ ప్రమోషన్ కోటాను 20 నుంచి 70 శాతానికి పెంచాలని, అనవసర డ్యూటీలు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ఎల్.రాములు, కె.రామప్పయ్య కె.నారాయణరావు, బి.తవుడు, కె.పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

– సంతకవిటి